క్లుప్తంగా

బతుకమ్మ చీరల పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: స్థానిక ఫైర్‌స్టేషన్ కార్యాలయంలో భద్రపర్చిన బతుకమ్మ చీరలను శనివారం రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఫైర్ స్టేషన్‌లోని ఓ గదిలో సుమారు ఐదువేల బతుకమ్మ చీరలను నిల్వ చేసిన విషయంపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో శనివారం చీరలను పరిశీలించారు. చీరలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆర్ఐ రామా తెలిపారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ

వృథాగా పోతున్న నీరు



కురవి: మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్ హాల్ ఎదురుగా జాతీయ రహదారికి పక్కన ఉన్న మంచినీటి పైపులైన్ లీకేజీ కావడంతో తాగు నీరు వృథాగా పోతున్నాయి. కొన్ని రోజుల నుంచి తాగునీరు వృథా అవుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడంలేదు. సంబంధిత అధికారులు పరిశీలించి లీకేజీని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

బలరాంనాయక్ పూజలు



కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో సీతాసమేత కోదండరామస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా మాజీ కేంద్రం మంత్రి, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలంతా దేవుని ఆశీస్సులతో చల్లగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నూకల వెంకటేశ్వర్లు, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, బండారు దయాకర్, ఎంపీటీసీలు బాలునాయక్, కృష్ణ మూర్తి, ఇనుగుర్తి మండల అధ్యక్షుడు సతీష్, విజేందర్, రమేష్, అడప రమేష్, పరిపూర్ణా చారి పాల్గొన్నారు.

పాఠశాలకు సిమెంట్ బెంచీల వితరణ



కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని భూక్యా నందిని తల్లిదండ్రులు భూక్యా వీరన్న దంపతులు పాఠశాలకు సిమెంట్ బెంచీలను శనివారం బహూకరించారు. విద్యార్థిని భూక్యా నందిని క్రీడల్లో రాణిస్తూ కబడ్డీలో జాతీయ స్థాయికి ఎంపికైంది. దీంతో పాఠశాలకు సిమెంట్ బెంచీలను అందజేశారు. పాఠశాల హెచ్ఎం డీసీఎస్ శర్మ, హెచ్‌డబ్ల్యూఓ పద్మ, పీడీ అనిల్, ఉపాధ్యాయులు వెంకన్న, బద్రు, మంగీలాల్, బాల్‌రాజు, శ్రీను, గోవర్ధన్, ధర్మ, కరంచంద్ వీరన్నను అభినందించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలి

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని అరికట్టేందుకు చర్య చేపట్టాలని అంబేద్కర్ సేవా సంఘం ప్రతినిధి గాజుల వేణుగోపాల్ శనివారం డిమాండ్ చేశారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు

నిర్మానుష్యంగా వీధులు



డోర్నకల్: డోర్నకల్‌లో తీవ్రమైన ఎండలతో ప్రజలు బయటకు రాకపోవడంతో వీధులు నిర్మానుష్యమవుతున్నాయి. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తీవ్రమైన ఎండతో ప్రజలు బయటకి రావడంలేదు.

ఎడారిని తలపిస్తున్న ఆకేరు వాగు

- నీరు లేక వెలవెల
- సాగునీరందక రైతుల ఆందోళన



చుక్కనీరు లేక వెలవెలబోతున్న ఆకేరు వాగు

చిన్నగూడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలకు సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం శివారులోని ఆకేరు వాగులో నీరు లేక పూర్తిగా ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. దీంతో వందల ఎకరాల్లో సాగు చేసిన పంట పొలాలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట చేతికందే సమయానికి నీరు లేక ఎండిపోతున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. గతేడాది వేసవిలో సైతం ఆకేరు మత్తడిపోస్తూ రైతులు ఏటా రెండు పంటలు సాగు చేసేవారు. గతంలో కాళేశ్వరం నీళ్లతో ఎస్సారెస్పీ కాల్వలతో వాగుల్లో, చెరువుల్లో జలకళ సంతరించుకుంది. ప్రస్తుతం మాత్రం మండల వ్యాప్తంగా ఏ గ్రామంలో చూసిన అరకొర నీటితో వేసిన పంటలు చేతికందే పరిస్థితి లేదని రైతులు తెలుపుతున్నారు. చుక్కనీరు లేక వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు బావుల్లో పూడికతీత, కొత్త బోర్లు వేస్తూ ఆర్థికంగా కుంగిపోతున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి తీరా పంట చేతికందకపోతే దిక్కు తోచలేని పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగుల్లో, చెరువుల్లో మూగజీవాలకు సైతం చుక్క నీరు లభించక ఇబ్బందులు పడుతున్నామని పశువుల కాపర్లు తెలుపుతున్నారు. మండల పరిధిలోని ఆకేరు వాగు శివారు గ్రామాలైన చిన్నగూడూరు, పగిడిపల్లి, ఉగ్గంపల్లి, విస్సంపల్లి, జయ్యారం, మన్నెగూడెం గ్రామాలకు చెందిన రైతులు పెట్టిన పెట్టుబడి రాబట్టేందుకు పగలు, రాత్రి తేడా లేకుండా ఆకేరులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం జలాలను ఎస్సారెస్పీ కాల్వల ద్వారా ఆకేరు వాగులో నీటిని విడుదల చేసి సాగు, తాగునీరందించి ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చుక్కనీరు లేదు



ఆకేరు వాగులో చుక్కనీరు లేదు. 3 ఎకరాల్లో వరి సాగు చేశాను. తీరా పంట చేతికందే సమయానికి నీరందక ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పగలు, రాత్రి వాగు లోనే ఉంటూ ఊట బావులు తీసి పంట పొలానికి నీరు అందిస్తున్నా.

- జుజ్జూరి వెంకన్న, రైతు, ఉగ్గంపల్లి

హామీలు విస్మరిస్తే నిలదీస్తాం..



మాట్లాడుతున్న రెడ్యానాయక్

డోర్నకల్: కాంగ్రెస్ నేతలు ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను విస్మరిస్తే రోడ్లపై నిలదీస్తామని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ హెచ్చరించారు. స్థానిక జైన్‌భవన్‌లో శనివారం జరిగిన మున్సిపాలిటీ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రజలను హామీలతో మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల హామీల అమలు కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా మాలోత్ కవితను భారీ మెజారిటీతో గెలిపిస్తే నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, పీఏసీఎస్ చైర్మన్ భిక్షంరెడ్డి కౌన్సిలర్లు బోరగళ్ల శరత్, పోటు జనార్ధన్, సంధ్యారాణిరమేష్, మొనికాయశోధర్‌జైన్, రాధికావీరన్న, కోఆప్షన్ సభ్యులు రాంభద్రం, అజీత్‌మియా, ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున్, నాయకులు కత్తెరసాల విద్యాసాగర్ మన్యుపాట్ని, పాండునాయక్, సతీష్‌గౌడ్, గౌస్‌పాషా, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

కూలర్ల షాపులో చోరీ

మహబూబాబాద్ రూరల్: కూలర్ల షాపు తలుపులు పగులగొట్టి రూ.లక్ష విలువ చేసే చిన్నకూలర్లు, మోటార్లు, వాటి విడిభాగాలు అందినకాడికి దొంగలు దోచుకొనిపోయిన సంఘటన జిల్లా కేంద్రంలోని బంధం చెరువు సమీపంలో చోటుచేసుకుంది. రోజు మాదిరిగానే షాపు యజమాని షకీల్ శుక్రవారం రాత్రి షాపునకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు శనివారం ఉదయం షాపు తాళం తీసి లోపలికి వెళ్లేసరికి వెనుక వైపున తలుపులు పగులగొట్టి ఉండడాన్ని గమనించాడు. షాపులోని చిన్న కూలర్లు, మోటార్లు దొంగతనం జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఆనవాళ్లు గుర్తుపట్టకుండా దొంగలు సీసీ కెమెరా పుటేజ్ నిల్వ ఉండే హార్డ్ డిస్క్‌ను కూడా చోరీ చేయడం గమనార్హం.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: ఎస్సీ స్టడీ సర్కిల్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో గ్రూప్స్ ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు ఉచిత శిక్షణ తరగతులు ఏప్రిల్ 1న జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఉదయం 9గంటలకు ప్రారంభమవుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల శాఖ ఇన్‌చార్జ్ అధికారి ఆర్.బాలరాజు శనివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువతి, యువకులు ఒరిజినల్ డిగ్రీ, కులం, ఆదాయం, ఆధార్‌కార్డు సంబంధిత ఎస్సీ శాఖ అధికారులచే వెరిఫికేషన్ చేయించుకొని, 2 పాస్ ఫొటోలతో సెట్ జిరాక్స్ పత్రాలను సమర్పించాలన్నారు. ఉచిత హాస్టల్ భోజనం, వసతి కల్పించబడతాయన్నారు. వివరాలకు జిల్లా ఎస్సీ షెడ్యూల్డ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బలరాంనాయక్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు ఖాయమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ ధీమా వ్యక్తం చేశారు. మరిపెడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డోర్నకల్ నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన మెజార్టీ కంటే అధికంగా రావాలన్నారు. మండల స్థాయిలో సీనియర్ నాయకులు చేరికలపై దృష్టి పెట్టాలన్నారు. పది సంవత్సరాలుగా తన వెన్నంటే ఉన్న కార్యకర్తలను ఎప్పుడు మరిచిపోనన్నారు. మండల స్థాయి నాయకులు కార్యకర్తలతోపాటు మీడియా మిత్రులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గందరగోళంగా సొసైటీ మహాజనసభ



వాగ్వాదం చేస్తున్న పాలకవర్గ సభ్యులు

బయ్యారం: మండలకేంద్రంలోని పీఏసీఎస్(సొసైటీ) ఆవరణంలో శనివారం నిర్వహించిన మహాజన సభలో గందరగోళం నెలకొంది. సభ ప్రారంభం కాగానే సొసైటీకి సంబంధించిన నిధుల దుర్వినియోగం విషయంలో డీసీఓ ఇచ్చిన నోటీసులపై సమాధానం చెప్పాలని సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణతోపాటు పలువురు పాలకవర్గసభ్యులు ప్రశ్నించారు. దీంతో చైర్మన్ మధుకర్‌రెడ్డి మద్దతుదారులు ప్రశ్నించిన పాలకవర్గసభ్యులపై ఎదురుదాడికి దిగడంతో గందరగోళం నెలకొంది. ఈక్రమంలో వైస్ ఎంపీపీ గణేష్ ప్రొటోకాల్ ప్రకారం తనను ఎందుకు ఆహ్వానించలేదని సొసైటీలో అక్రమాలకు పాల్పడుతున్న చైర్మన్‌పై చర్య తీసుకోవాలని నినాదాలు చేయటం మరింత ఉద్రిక్తతకు దారితీసింది. పాలకవర్గసభ్యులు ఇరువర్గాలుగా విడిపోయి ఒకరిపై మరొకరు దూషణలకు దిగారు. ఆ తరువాత పరిస్థితి సద్దుమణగడంతో సభను ముగించారు. కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గసభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వందపడకల ఆస్పత్రి ఎప్పుడో?

- రూ. 36కోట్లతో నిర్మాణానికి శంకుస్థాపన
- ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా అడుగులుపడని వైనం
- ప్రజల ఎదురుచూపులు




మరిపెడలోని పీహెచ్‌సీ



శంకుస్థాపన చేసిన శిలాఫలకం

మరిపెడ: మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 100పడకల ఆస్పత్రి నిర్మాణానికి గత ఏడాది సెప్టెంబర్ 28న అప్పటి వైద్య, ఆరోగ్యశాఖమంత్రి తన్నీర్ హరీశ్‌రావు రూ. 36కోట్లతో శంకుస్థాపన చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా ఆస్పత్రి నిర్మాణ పనులకు స్పష్టత రావకపోవడంతో స్థానిక పేద ప్రజలు నిరాశకు గురవుతున్నారు. మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 1962లో ఏర్పడి అప్పటి పాతతాలుక కేంద్రం పరిధిలోని వివిధ మండలాల ప్రజలకు సేవలందిస్తూ వస్తోంది. ఈనేపథ్యంలో 100పడకల ఆస్పత్రి నిర్మిస్తే అన్ని రకాల వైద్యసేవలు అందే అవకాశాలున్నాయి. అందుకోసం 25మంది వైద్య సిబ్బందిని కూడా కేటాయించారు. నిర్మాణం జరగకపోవడంతో వారిలో 20మందిని వివిధ ఆస్పత్రుల్లో విధులు అప్పగించారు. ప్రస్తుతం ఇద్దరు వైద్యాధికారులతో ఆస్పత్రి సేవలందిస్తుంది. ఏరియా ఆస్పత్రిగా మారితే ఐదుగురు వైద్యాధికారులు, సూపరింటెండెంట్‌తో సహా ఇతర సిబ్బంది, అంబులెన్స్ సేవలు నిత్యం అందుబాటులో ఉంటాయి. ఆస్పత్రి జాతీయ రహదారిపై ఉండడంతో ప్రమాదాలు జరిగిన వెంటనే ఆస్పత్రికి క్షతగాత్రులను ఆస్పత్రిలో చేరేందుకు వీలుగా ఉంటుంది. పాలకులు ఉన్నాధికారులు స్పందించి వందపడకల ఆస్పత్రి నిర్మాణం జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఆస్పత్రి నిర్మాణం ఎంతో అవసరం



ఈ ప్రాంతంలో ఎక్కువగా ఎస్టీ, ఎస్సీ వెనుకబడిన తరగతుల వారు అధికంగా ఉండడంతో ప్రైవేట్ వైద్యం చేయించుకొనే స్థోమత వారికి లేదు. ఏరియా ఆస్పత్రి ఏర్పాటు జరిగితే వారందరికి మేలు జరుగుతుంది. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణ పనులకు సహకరించాలి.

- ఎడెల్లి పరశురాములు, మరిపెడ

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తొర్రూరు: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమళ్ల మహేష్ తెలిపారు. మాల మహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణపై ముద్రించిన కరపత్రాలను శనివారం డివిజన్ కేంద్రంలో సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 2నుంచి 8వరకు మాల మహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ యాత్ర చేపడుతున్నామన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు మాట్లాడటం దారుణమన్నారు. మహనీయుడు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే ప్రభుత్వాలనే మారుస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గొడిశాల నవీన్, నాయకులు యనమల శ్రీనివాస్, అంజయ్య, రాకేష్, ధర్మయ్య, రవి పాల్గొన్నారు.

కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

- సీసీ రోడ్డు క్యూరింగ్‌కు జీపీ ట్రాక్టర్ల వాడకం
- లీకైన మిషన్ భగీరథ గేట్‌వాల్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



భగీరథ గేట్ వాల్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మరిపెడ రూరల్: ఓ కాంట్రాక్టర్ మిషన్ భగీరథ పైపులైన్ గేట్ వాల్ లీక్ చేసి ఎడ్జెర్ల, గుర్రప్ప తండా గ్రామ పంచాయతీల రెండు ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సీసీ రోడ్డు క్యూరింగ్‌కు నీటిని ఉపయోగిస్తున్నాడు. వేల కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం ప్రజలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తుంది. కానీ కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలకు వేసవిలో దాహార్తిని తీర్చే మిషన్ భగీరథ నీటిని సీసీ రోడ్డుకు ఉపయోగించడం శోచనీయం. ఈమేరకు 'సీసీ రోడ్డుకు మిషన్ భగీరథ నీరు' అనే కథనం సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన విషయం విదితమే. కాగా ఈ మేరకు స్పందించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఎడ్జెర్ల, గుర్రప్పతండా గ్రామ కార్యదర్శులకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు మరిపెడ ఎంపీఓ పూర్ణచందర్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా లీక్ చేసిన ఎడ్జెర్ల ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ గేట్‌వాల్‌కు మరమ్మతులు చేసినట్లు మిషన్ భగీరథ ఏఈ రాకేష్ పేర్కొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న శంతన్ రామరాజు

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ సంఘం నేత శంతన్ రామరాజు ఇంటికి శనివారం ఎమ్మెల్యే వెళ్లి శంతన్, మేనక దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నివిధాలా నష్టపోయి కాంగ్రెస్ పార్టీనే ప్రాణంగా భావించి, జెండా మోసిన కార్యకర్తలను తప్పక గుర్తుంచుకుంటానని తెలిపారు. తన గెలుపులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టం దాగుందని సరైన సమయంలో వారికి సరైన గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

నీళ్లకోసం పైపులైన్ ఏర్పాటు



పైపులైన్ కనెక్షన్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో నీటి సౌకర్యం కోసం సుమారు 150 మీటర్ల నూతన పైపులైన్ పనులు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వివేక్రం శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల గ్రామంలో నీళ్ల రావట్లేదని గ్రామస్తులు చేసిన రాస్తారోకో తెలిసిందే. దీనిపై స్పందించిన డీపీఓ హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ కృష్ణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అనూష శుక్రవారం గ్రామంలో సందర్శించి తగిన ఏర్పాట్లు తీసుకోవాలని సూచించడంతో గ్రామానికి చెందిన రజియాకు చెందిన బోరుబావిని లీజ్‌కు తీసుకొని పైపులైన్ ఏర్పాటు చేసి, గ్రామంలోని పైపులైన్‌కు కలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సృజన, రమేష్, పాషా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన 'పది' పరీక్షలు



డోర్నకల్/గార్ల/చిన్నగూడూరు: జిల్లా వ్యాప్తంగా శనివారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు పరీక్ష రాసిన విద్యార్థులు కేరింతలు కొడుతూ.. ఇంటి బాట పట్టారు. కాగా మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సోమవారం జరిగే ఒకేషనల్ పరీక్షకు హాజరు కానున్నారు.

టెట్ ఫీజును వెంటనే తగ్గించాలి

గార్ల: భారీగా పెంచిన టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని పీడీఎస్‌యూ మండల కార్యదర్శి మహేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గార్లలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో టెట్ పరీక్ష ఫీజు కేవలం రూ.400 మాత్రమే ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రూ.1600 ఫీజు పెంచడంతో డీఎస్సీ నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పవన్, సతీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

పరామర్శ..

కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బందారపు సూరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు శనివారం మృతుడి కుటుంబాన్ని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌లు వేర్వేరుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, ధన్నసరి సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, కేసముద్రం సొసైటీ చైర్మన్ దీకొండ వెంకన్న, సొసైటీ డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నీలం దుర్గేష్, జాటోత్ హరీశ్‌నాయక్, యాకుబ్ రెడ్డి, శంకర్, భీమా, భద్రు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలకు ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణానికి చెందిన కవి, రచయిత, తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు, కళా వేదిక రాష్ట్ర కార్యదర్శి గుర్రపు సత్యనారాయణకు మద్రాస్ విశ్వ విద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలకు ఆహ్వానించారు.

వైభవంగా తెప్పోత్సవం



డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామ శివారులోని మున్నేరువాగులో శనివారం శ్రీవేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో హోమం నిర్వహించారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం



కేసముద్రం: మండలంలోని కల్వల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వంగాల వెంకట్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా, శనివారం అభినందన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రిటైర్డ్ హెచ్‌ఎం దంపతులను, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చిలుక నాగయ్య, రౌతు లక్ష్మీనారాయణ, చీకటి వెంకట్రాంనర్సయ్య, సుమలత, స్వరూప, ఉమేశ్వర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

దంతాలపల్లి: మండలం పాలేరు, నర్సింహులపేట మండలం ఆకేరు వాగునుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు. గ్రామస్తుల పక్కా సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించామన్నారు.

సన్మానం

గార్ల: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను శనివారం బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్.విమల్‌కుమార్ జైన్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభివృద్ధికి ఎంతో కృషి చేసినందున, కేంద్రప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించడం హర్షనీయం అన్నారు

రుణాలు తీసుకున్న రైతులకు ఇన్సూరెన్స్

ఖానాపురం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోల రుణాలు తీసుకున్న రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన 65వ మహాజన సభకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖానాపురం సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పాలకవర్గ సహకారంతో ఐక్యంగా పని చేస్తామని తెలిపారు.

విద్యార్థుల ప్రాణాలకు భద్రత ఏది?



మహబూబాబాద్ అర్బన్: పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు చెబుతున్నా.. పట్టింపు లేకుండా ఆటోలు, డీసీఎంలు, టాటాఏస్‌లలో పరిమతికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. పదో తరగతి పరీక్షల జరుగుతున్న క్రమంలో శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ గురుకులం విద్యార్థులను డీసీఎం వాహనంలో పరీక్షలకు తరలిస్తున్నారు. మితిమీరిన వేగంతో నిత్యం పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రవాణాశాఖ అధికారులు చూసీచూడనట్టుగానే వ్యవహరిస్తున్నారు. తమ పిల్లల ప్రాణాలకు భద్రత ఎదని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై బీసీ గురుకులం శాఖ ఉన్నత అధికారులు పూర్తి విచారణ చేసి, ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్య తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.